# తగువులు తీర్చే సంక్రాంతి

'ఒరేయ్ రామూ! నీకోసం రామచంద్ర రావు వచ్చి వెళ్లాడ్రా' అంది మా బామ్మ నేను యింట్లోకి పోగానే. ఆశ్చర్యపోయాను. రామచంద్ర రావు నా కోసం మా యింటికి రావటమేమిటీ! క్రిందటి దీపాళినాడు మా యిద్దఱికీ లడాయి వచ్చింది. మేము మాట్లాడుకోవటం మానేసి చాలా నెలలైందే!

'ఏమిటాలోచిస్తున్నావ్? ఇది సంక్రాంతిపండగ మర్చిపోయావా?' అంది ఆవిడ ఆందుకొని.

'అయితే?' అన్నాను ఏమీ అర్థంకాక.

'అయితే మీకు తగూ ఎప్పుడు వచ్చిందీ?'

ఇంటిల్లపాదికీ మాకు తగువు ఎందుకు వచ్చిందో, ఎప్పుడు వచ్చిందో తెలిసివుండగా, యీావిడ యీ వేళ ఎందుకబ్బా-యీ ప్రశ్నలు వేస్తున్నదనుకొంటూనే 'అక్టోబరులో; దీపావళికి ముందు' అన్నాను.

'ఊహు. దీపావళికి వచ్చిన తగూ సంక్రాంతికి తీరపోవాలి. ఈ పండుగనాడు ఎటువంటి తగూలు, పోట్లాటలూ వుండకూడదు, ఎవ్వరికీసి' అందావిడ.

ఎందుకనో నాకేమీ బోధపడలేదు. రామచంద్ర రావు నాకోసం రావడం; యీావిడ యిది చెప్పడం, యీ రెంటిని బట్టీ చూస్తే దీని వెనక ఏదో ఇతిహాస ముంటుందని గమనించా. తెలియనివి వుంటే అడిగి తెలుసుకోవడం మంచిది కాదూ?

అందుకని-'బామ్మా! తగువులు ఎందుకు వుండకూడదో సరిగా చెప్పవూ? నీకు పుణ్యముంటుంది?' అని వేడుకొన్నాను.

'ఈ సంక్రాంతి మనకు ప్రతియేడూ వస్తుంది. ఇది మనకు పెద్ద పండుగ. ఈరోజే మన యిళ్లకు కొత్త ధాన్యం వస్తుంది. పల్లెటూళ్లలో యీరోజు ఎంత సందడిగా ఉంటుందో నీకేం తెలుసు? పల్లె సీమలన్నీ కళకళలాడి పోతుంటాయ్. ఈనాడే మనం కొత్త బియ్యంతో 'పరమాన్నం' వండుకొంటాము. అది తింటూ పాత పోట్లాటలన్నీ మర్చిపోవాలి.'

'ఎందుకని?'

'ఎందుకనా? - అయితే చెప్తా విను.

'పూర్వం అంటె మీ ముత్తాత నాటి కాలంలో సంఘటన యిది: అప్పటికి నాకు పదిహేను సంవత్సరాలుంటాయనుకొంటాను. మీ తాతయ్య తండ్రికి యింకా అప్పటికి వందెకరాల పొలం వుండేది. ఆ గ్రామానికి ఆయనే పెద్ద. ఆవూరివారంతా ఆయన ఎంత చెబితే అంత; దారిని వస్తుంటే అందరూ భయపడే వారే.

'ఆయనకు ఓ తమ్ముడుండే వాడు -'సీతయ్య'అని. రౌడీ అంటే రౌడీ ఆయనే. నిజంగా ఆయన్ను చూస్తుంటే అందరికీ హడలెత్తిపోయేది. ఆ గ్రామాన్నంతా ఓ చేతిలో పెట్టకొన్నాడాయన వాళ్ల అన్నయ్య (రామయ్య)తో మాట్లాడ్తున్నా ఆయనక్కూడా యితనంటే భయము. కాని ఏమీ చేసేవాడే కాదు.

'ఒకనాడు వారిద్దరు (రామయ్య సీతయ్యలు) మాట్లాడుకొంటూండగా ఒక షావుకారు వచ్చాడు. ఆయన బీదవాడు కావటంచేత వ్యాపారం చేసుకొందామని వచ్చి రామయ్యను అడిగాడు. 'ఏమండి. ఎక్కడన్నా ఒక్కగది యిప్పిస్తే మీ బజాగులో కొట్టు పెట్టుకొంటా'నని. 'ఏమంటావురా' అని సీతయ్యను హెచ్చరించాడు రామయ్య.

'ఆలోచన యెందుకు?- ఈ తోటలో గది ఖాళీవుందిగా పెట్టుకోమను'అన్నాడు సీతయ్య. అంటూనే ఆ షావుకారు వైపుకి తిరిగి ఆజ్ఞాపిస్తున్నట్లుగా 'పోవాయ్. నిలబడ్డావేం? పోయి నీపని చూసుకో?' అన్నాడు. షావుకారు వెళ్లిపోయాడు.

కాలం గడచిపోతూంది. సీతయ్యకు మళ్లీ ఏం గుబులు మళ్లిందో

# తగవులుతీర్చే సంక్రాంతి

ఏమో - ఒకనాడు అన్నగారి దగ్గరకువచ్చి, 'ఏంరా ? ఆకొట్టు తీసెయ్యించ వట్రా?' అన్నాడు బుసలుకొట్టుతూ. 'కనుక్కొంటాలే వుండు' అని అన్నగారు సమాధానం యిచ్చాడు.

'తీయకపోతే కొట్టు గిట్టు లేచి పోతుంది. జాగ్రత్త' అని చెప్పి అంటూ వెళ్ళి పోయాడు సీతయ్య.

'రోజుకో తెగులు. నిన్నటిదాక ఉంచుకోమని, యీవేళ తీసెయ్యమంటూ డర్థంలేకుండా. అదేమంటే కొట్టవచ్చినట్లు చూస్తాడు. ఛీ. ఛీ...' అని విసుక్కొన్నాడు రామయ్య. అదే ధోరణిలో 'గొంతుమీద కూర్చుని తీసెయ్యమంటే ఏలా తీస్తాడు, ఆ షావుకారు మాత్రం ? ఆచ్చేముందే వుండాలి, ఆ ఆలోచన. ఆలోచన లేని పనులు చేస్తే యీలాగే తగలబడుతాయి.

'నేనున్నా నంటే అందరికి గౌరవమే... కాని వీడి మూలంగా నా పరువు కూడా పోతున్నది. ఛీ-ఛీ-' అని గొణుక్కొంటూ వుండగా, ఆయన భార్య తను కల్పించుకొని 'ఎందుకండిఅలావిసుక్కొంటారు?' అని అడిగింది.

'మోసే వాడికి తెలుస్తుంది బరువు. ఇంట్లో కూర్చుంటే ఏం తెలుస్తుంది? మొగాడు సంపాయించి తెస్తుంటే, ఆడది ఇంట్లో కూర్చుని...' అంటూ ఆయన తమ్ముడి మీది కోపంతో ఆవిడమీది విరుచుకు పడ్డాడు.

'నాకెందుకులే' అంటూ లోపలికి పోయింది ఆ యిల్లాలు. రామయ్యకేమీ అర్థం కావడం లేదు. ఈ సమస్యను పరిష్కారం చెయ్యడం ఎలాగో తెలిసిందికాదు. ఇంతలో షావుకారు వచ్చి లబోదిబో మంటూ 'రామయ్య గారూ! మీ తమ్ముయ్యగారు నా సరుకంతా వీధిలోకి గిరాటు పెట్టుతున్నాడండీ' అంటూ గోల పెట్టాడు.

'రామయ్యకు కోప మొచ్చింది. ఏం జేయగలడు? తమ్ముడై పోయాడు. అదే గనక యింకా ఎవరన్నా అయితే అనుకొని...

'షావుకారు గారూ! మీ సరుకు మా వసారాలో తెచ్చుకొని పెట్టుకోండి ప్రస్తుతానికి తరువాత చూద్దాం' అని అతనికి అభయ హస్తం యిచ్చాడు.

'అక్కడ సీతయ్య రామయ్య మీద కూడా ఎగిరి పడ్తున్నాడు- షావుకారు నాదరించి నందుకు.

'ఆ తరువాత కొద్ది రోజులకే నరక చతుర్దశివచ్చింది. ఆ ఉదయం వీధిలో పెద్ద గలాటా జరుగుతూంది. ఏమిటా అని చూద్దును గదా రామయ్యను కొట్టి పంపాడు సీతయ్య. ఇంకా ఏదో వాగుతున్నాడు రామయ్య మీద. కాని



రామయ్య మాత్రం మారు మాట్లాడ లేదు. మధ్యవర్తులు కూడా మాట్లాడడం లేదు.

'రేపు, దీపావళి రాత్రి 'తోటా' వెలిగించి వీడి కొంప కంటించకపోతే నాపేరు సీతయ్య కాదు. వీడెంతా?వీడి బ్రతుకెంతా?' అంటూ ఆగకుండా అరుస్తూనే వున్నాడు సీతయ్య.

'ఊరుకో సీతయ్యా, అయిపో యిందానికి...అటువంటి పిచ్చిపను లేమీ చేయకు' అన్నాడొక మునలాయన, ఎలాగో ధైర్యం తెచ్చుకొని. 'వాడిసంగతి నీకేం తెలుసు వూరుకోవయ్యా! పెద్ద చెప్పవచ్చావు పోపో!. అని కసిరేశాడు సీతయ్య ఆ మునలాయనను.

'దీపావళి రాత్రి వూరంతటా దీపాలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. వూరూవాడా కళ కళలాడి పోతూ కన్నుల పండువుగా వుంది. అందరూ టపాకాయలు కాల్చుకొంటున్నారు. ఉన్నట్లుండి జనం ఒకయింటి వైపు పరుగులెత్తారు. అక్కడ ఒక యిల్లు తగులబడి పోతున్నది. ఆయిల్లు రామయ్య ఇల్లే! అన్నంత పనీ చేశాడు సీతయ్య - అంతపని చేసినందుకు సీతయ్యను అరెస్టు చేయిద్దాం అనుకొన్నారు - కాని వూళ్లో అందరికీ ఆసీతయ్య అంటే భయమేగా? ఆ ఆలోచన అంతటితోనే ఉపసంహరించుకొన్నారు.

'అన్నదమ్ములిద్దరూ మాట్లాడుకొని కొన్ని నెల్లయింది. ఇంతలో సంక్రాంతి పండుగ వచ్చింది. అందరూ యిళ్లకు వెల్ల వేయించి అందాల భవనాలుగా తయారు చేసుకొంటున్నారు; పిల్లలు గొబ్బెమ్మలతో ఆడుకొంటున్నారు.

'ఇంతలో 'రామయ్యా' అని కేక వినిపించింది. ఆ పిలిచింది యింకెవరో కాదు - సీతయ్యే! ఇంటిల్లిపాదీ గడగడలాడి పోయారు, - యితగాడు మళ్ళీ ఏ అఘాయిత్యం చేస్తాడోనని.

'సంక్రాంతి పండ గొచ్చింది. మన కెందుకొచ్చిన తగువులు కానీ, రారా మాయింటికి పోదాం' అన్నాడు సీతయ్య ఆప్యాయంగా! రామయ్య వెళ్లాడు.

'అప్పటినుంచీ ఆ రెండు కుటుంబాలవాళ్లూ హాయిగా ఉంటున్నారు. వాళ్లిద్దరూ తర్వాత చనిపోయారనుకో ... చెప్తా..." అంటూ ముగించిది మా బామ్మ.

'అయితే బామ్మా! నేనూ పోయి, రామచంద్రరావుని పిల్చుకవస్తానుండు' అంటూ పరుగెత్తాను వాళ్ల యింటికి.

నేనూ రామచంద్రరావు పిన తల్లి పెత్తల్లి బిడ్డలం. తేలికపడిన మనస్సుతో నేను వాళ్ల యింటి గుమ్మంలో కాలుపెట్టి చూసేసరికి వాడు కాఫీ త్రాగ బోతున్నాడు. వాడుకూడా ఎంతో ఆప్యాయంగా నన్ను పిలుచుకెళ్లి కాఫీఇచ్చాడు. తగాదాలన్నీ పూర్తిగా మరచిపోయి కాఫీతాగి హాయిగా కూర్చొని వాడితో కబుర్లాడాను.

అప్పటి నుండి నేనూ, అదివరకు ఎవరితో పోట్లాడినా కూడా, సంక్రాంతి వచ్చేసరికి వాళ్లతో మాట్లాడేసి కులాసాగా కూడి ఆడుకోవటం అలవాటు చేసుకొన్నాను.

★



కేశ సంపదకు
రీటా
హిందూ దేశమంతటా దొరకును

రు. **1-14-0** లు మాత్రమే పెట్టుబడి పెట్టి
రు. **1024/-**లు సంపాదించండి

ప్రాస్పెక్టసుకు అ. -/2/-ల పోస్టేజితో వ్రాయండి:

ఇండియన్ నేషనల్ పాలిసీ కంపెనీ
(Money Circulating Scheme)

పో. బా. నం. 889 జి. పి. ఒ. కలకత్తా 1,

స్థాపితము — 1935

ఇండియాలో ఇటువంటి కంపెనీలలో ఇదే మొదటిది. స్థాపింపబడినప్పటినుండీ ఈ కంపెనీ ఎక్కువపేరు ప్రఖ్యాతులతో ప్రజలకు సేవ చేయుచున్నది.